# మరలివచ్చిన మగడు

రాత్రి ఎనిమిదయింది. సాయంత్రం ఆరింటికి రావాల్సిన బస్సు త్రోవలో చెడిపోయింది. పెందరాళే ఇంటికి వచ్చి అన్నీ సర్దుకోవచ్చుగదా అనుకుంది. చీకటిపడింది. మధ్యాహ్నమంతా ఎండలో ఆ బస్సులో ఒళ్ళంతా హూనమయింది. ఇంక ఇప్పుడేం చెయ్యడం !

ఉసూరుమంటూ ఇల్లు తాళంతీసి లోపలికి వెళ్ళింది. చీకట్లో తడుముకుని దీపం వెలిగించుకునేదాక దిక్కులేదు. ఈలోపల వంతట్టుకుని దేనిమీద పడుతుందో! తినడానికి తిండి లేకపోయినా, పూరిగుడిసెల్లో కూడ విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. తనఖర్మ! పదేళ్ళుగా ఈ చీకటిగదుల్లోనే కాపురం! ఆ ఇంటి యజమాని ఎన్నాళ్ళైనా దీపాలు పెట్టించడు. పెట్టించమని అడిగే తాహతు తనకు లేదు. ఏమడిగితే ఎక్కడ అద్దె పెంచమంటాడోనని భయం. ప్రొద్దుగూకగానే అందరూ విద్యుద్దీపాల కాంతిలో మెరసిపోతుంటే తాను ఉసూరుమంటూ లాంతర్లలో కిరసనాయిలు పోసుకుంటూ, తుడుచుకుంటూ కూర్చోవాలి! అప్పుడే ఏదో భరించలేని నిస్పృహ ముంచుకు వస్తుంది.

లాంతరు వెతికి ముట్టించింది. గదులు ఊడ్చింది. తనూ, తల్లి మానవి, భర్త కామయ్య అంతా పెళ్ళికి వెళ్ళారు. తన ఆడబడుచు కూతురు పెళ్ళి. తనకా పెళ్ళికి వెళ్ళాలనిలేదు. అయినా వెళ్ళకతప్పదు. ఈ పెళ్ళికి కానుకలకూ దానికీ దీనికీ

నలభై రూపాయలు ఖర్చు. రెండు నెలలు కష్టపడితేనేగాని ఇందు లోనించి తేరుకోలేదు?

కామయ్య, మానవి మర్నాడు పెళ్ళివారితో వస్తామంటే తను ఒకపూట ముందుగా వచ్చింది, ఇల్లువాకిలి బాగు చేసుకోవాలని. ఇంత ప్రొద్దుపోయి ఇప్పుడు తనకోసం వంట యేమిటి- పడుకుందామని ముందర గదిలో మూలగా ఉన్న చాపతీసింది. ఏదో పొడుగాటి నీలంకవరు జారి క్రిందపడింది. తాను ఊళ్ళోలేనప్పుడు వచ్చిందికాబోలు. పోస్టువాడు కిటికీ సందులోనించి విసరివేసి ఉంటాడు. ఆ కవరు కొత్తగా ఉంది. అలాంటి కవరు తానిదివరకు చూడలేదు. కవరునిండా రకరకాల ముద్రలు, కొట్టివేతలు ఉన్నాయి. ఉత్తరం ఎక్కడెక్కడో తిరిగి చాలా రోజులకు వచ్చినట్టుంది. ఆఉత్తరం అడ్రసూఅన్నీ ఇంగ్లీషులో ఉన్నాయి. తనకు ఇంగ్లీషురాదు. అది తీసుకుని ఎదురింటి శాంతమ్మ దగ్గరకు వెళ్ళింది.

శాంతమ్మ ఇంకా నిద్రపోలేదు ఏదో చదువుకుంటోంది. మధుర తెచ్చిన ఉత్తరం చదివి చెప్పింది. ఆ ఉత్తరం బర్మా నుంచి వచ్చింది. అది మధుర తండ్రి శివయ్య వ్రాసింది. అది వ్రాసి రెండు నెలలైంది. అది మానవతికి వచ్చింది. ఆ ఉత్తరం ఆఊరూ ఆఊరూ చుట్టి ఇన్నాళ్ళకు మధుర అడ్రసుకు వచ్చింది.

ఇవన్నీ విని మధుర తెల్లబోయింది. తన తండ్రి ఇల్లు వదలి వెళ్ళి ముప్ఫైఏండ్లయింది. ఇన్నాళ్ళు అతనిని గురించి ఏ కబురూ తెలియదు. అసలు అతను బ్రతికిఉన్నాడో లేదో కూడా తెలియదు. తండ్రి వెళ్ళిపోయినప్పుడు, తాను పసిపిల్ల.

రాజి అన్న పిల్లతో సంబంధం పెట్టుకుని తండ్రి చెప్పకుండా వెళ్ళిపోయాడన్న సంగతి తప్ప, తనకు ఇంకేమీ తెలియదు. తల్లి ఎప్పుడూ పొరపాటునైనా తండ్రిని గురించి మాట్లాడదు. అన్ని బాధ్యతలూ వదిలేసి తనసుఖం తాను చూచుకుని పోయిన మగవాడిని గురించి మాట్లాడేదేమిటన్న నిరసనభావంతో ఉంటుంది. చుట్టాలెవరన్నా ఎప్పుడైనా అతని ప్రసక్తి తెస్తే అక్కడనుంచి లేచిపోతుంది.

ఆ ఉత్తరంలో శివయ్య తనకు ఒంట్లో బాగుండలేదని, దేశానికి తిరిగివచ్చి అందరిని చూడాలనుకుంటున్నానని, వెంటనే బదులు రాయమని వ్రాశాడు. మధుర సంతోషించింది. తండ్రి వస్తే తనదరిద్రం తీరిపోతుంది. అతను బర్మాలో లక్షలు సంపాదించి ఉండొచ్చు. ఎంత సంపాదించి ఉంటాడో? ఆ ఊహాలో ఆమెకు ఊపిరాడలేదు. శాంతమ్మను అడిగింది. "బర్మాలో ముప్పైయ్యేళ్ళలో ఎంత సంపాదించవచ్చు?" అని. ఏం, ఎంత లేదన్నా ముప్ఫయి లక్షై వేలన్నా దాచిఉండడూ?" అన్నది ఆమె.

మధురకు మనస్సంతా ఆశలు కమ్ముకున్నాయి. శాంతమ్మను బ్రతిమాలుకుని అప్పుడే ఉత్తరం వ్రాయించింది, తండ్రిని వెంటనే బయలుదేరి రమ్మని.

మానవి ఈ విషయంలో ఏమీ ఆసక్తి చూపలేదు. భర్త తిరిగి వస్తాడని విని విరక్తితో పెదవి విరచింది. ఇప్పుడెందుకు తిరిగిరావడం, బ్రతుకంతా ఎడారిలాగ గడచిపోయిన తరువాత అనుకుంది. కామయ్య మాత్రం సంతో

పించాడు. మామగారు డబ్బుల సంచులతో వస్తే ఇహ తను ఈ గుమస్తాపని వదిలేసి హాయిగా ఉండచ్చు అని.

అప్పుడు వస్తానని వ్రాసిన శివయ్య తరువాత ఎనిమిది నెలలకు వచ్చాడు. అతను వచ్చినరోజు మధుర ఇల్లంతా శుభ్రంచేసి, పిండివంటలుచేసి ఉత్సాహంతో అతనికోసం ఎదురు చూసింది. మానవి వంట్లో బాగుండలేదని లోపలిగదిలోకి వెళ్ళి ముసుగుపెట్టుకు పడుకుంది భర్తవచ్చే టైముకు. ఎదురుగుండా కనిపించడానికికూడా ఆమెకు బుద్ధిపుట్టలేదు.

శివయ్యకు ఎప్పుడో పక్షవాతం వచ్చింది. ఒక చెయ్యీ ఒక కాలూ స్వాధీనంలేదు. ఒక కర్ర ఆధారంతో మెల్లగా నడుస్తాడు. దేశంనుంచి వెళ్ళినకొద్ది రోజులకే రాజి శివయ్యను వదిలేసి తనత్రోవన తాను పోయింది. మళ్ళీ ఒక బర్మా అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. సంసారం ఏర్పడింది. కాని సంపాదన లేకుండా తనమీద ఆధారపడిన శివయ్య ఇప్పుడు ఆ భార్యా పిల్లలకు నచ్చలేదు. వాళ్ళ అనాదరణ భరించలేక అతనికి ముప్పయ్యేళ్ళ తరువాత తాను వదిలి వచ్చిన దేశం, బంధువులు, భార్య గుర్తుకు వచ్చారు. బర్మాలో భార్య డబ్బంతా ఎప్పుడో తనవశం చేసుకుంది. శివయ్యకు తిరిగి రావటానికి కూడా డబ్బులేదు. ఎలాగో ప్రయాసపడి ప్రయాణమయ్యాడు.

ఇంటికి రాగానే ఇవన్నీ మధురకు చెప్పాడు. ఆమెకు నిస్పృహ కలిగింది. ఒట్టి చేతులతో వచ్చాడని విలవిల లాడింది. శివయ్యకు కళ్ళనీళ్ళు తిరిగాయి. అతనికళ్ళు మానవికోసం వెతుక్కున్నాయి. మానవి మళ్ళా తనను ఆదరిస్తుందా?

"మానవి ఏదీ?" అని అడిగాడు శివయ్య జంకుతూ. మధుర విసుగుతో చెప్పింది: "లోపల గదిలో పడుకుంది. ఏమో జ్వరమట పోయిచూడు" అన్నది.

మానవి ఆమాటలు విని ఇంకొంచెం ముడుచుకు పడుకుంది. శివయ్య వస్తున్నాడని తెలిసినా ఆమెకేమీ సంతోషం కలగలేదు. ఇన్నాళ్ళ తరువాత ఇప్పుడెందుకు? ఎవరికోసం అనుకుంది. ఆమెకు తన జీవితంలో భయంకరమైన ఒంటరితనం తప్ప ఇంకేమీ కనిపించలేదు. పురిటిమంచంమీద ఉన్న తనను నిర్దాక్షిణ్యంగా వదలి శివయ్య ఒకానొకరాత్రి అంతర్థానం అయ్యాడు. ఆ మాట విని తాను కుమిలి పోయింది. అతనికి రాజీతో సంబంధం ఉన్నదని తనకు అదివరకే తెలుసు. ఇల్లాంటివి దాచినా దాగవు. ఎలాగో నలుగురికీ తెలుస్తుంది. ఊళ్లో అందరూ అనుకొంటూ ఉంటె తాను విన్నది. అయినా తన్ను తాను మార్చుకున్నది. త్రోవ తప్పిన పక్షి ఎప్పుడో తిరిగి గూటికి చేరుకోక తప్పదనుకుని ధైర్యంగా ఉంది. ఆ పక్షి తిరిగి చూడకుండా ఎగిరిపోతుందని తెలియలేదు. శివయ్య వెళ్ళిన తరువాత తాను చాలారోజులు దిగులుపడి కూర్చుంది. ఏడాది వరకు ప్రతిరోజు ఉత్తరంకోసం ఎదురుచూస్తూనే ఉంది. పసిపిల్లతో తనను వదిలేసి ఇంత అన్యాయం చేస్తాడా? దిగ్భ్రాంతి చెందింది. ఏమైనా మనిషి ఎదట లేడు. ఉంటే సమాధానాలు ఇచ్చినా, ఇవ్వక పోయినా ప్రశ్నలు అడగవచ్చు. కాని శివయ్య జాడ తెలియదు. తాను ఏం చెయ్యగలదు? రెక్కలు విరిగిన పక్షి ఎగరనూ లేదు – చావనూ లేదు. హృదయవిదారకంగా

అరవనూ లేదు. లోలోపల కుమిలికుమిలి అణగారిపోయింది. ఎల్లాగో బ్రతకక తప్పదు. పసిపిల్లకు తానే ఆధారం! తడిసిన కన్నులతో ధైర్యం నింపుకొని మొండిగా సాగించింది జీవితం. పిల్ల పెద్దదయి కాపరం చేస్తోంది. ఇంక తనకేమీ బాధ్యతలు లేవు. ఒంట్లో ఓపిక ఉన్నన్నాళ్ళు చాకిరీ చేస్తుంది. కూతురు పోషిస్తోంది. రోజులు గడచి పోతాయి!

ఇప్పుడెందుకు శివయ్య తిరిగి రావడం! గడచిన జీవిత మంతా భయంకరమైనలోయ! కిటికీలోనించి భయంకరమైన శూన్యాన్ని చూస్తూ, వానచుక్కలతో సమంగా కన్నీటి చుక్కలు రాలుస్తూ, గడపిన రాత్రులు. సరదాగా సంసారపు గొడవలు చెప్పుకుంటూ సుఖంగా ఉన్న భార్యాభర్తలను చూసి దృష్టి తగులు తుందేమోనని భయంతో చూపులు మరల్చుకొన్న క్షణాలు మాత్రమే స్ఫురణకు వస్తాయి! శివయ్య తన జీవితం ఎడారి పాలుచేశాడు. కాని తాను ఏ సుఖాన్నీ వదలుకోలేదు. మళ్ళా పెళ్ళిచేసుకున్నాడు. మళ్ళా ఇంకో సంసారం ఏర్పరచుకొన్నాడు. తనకు డబ్బు, ఆరోగ్యం అన్నీ చక్కగా ఉన్నప్పుడు ఒక్కనాడైనా, చెప్పకుండా వదలి వచ్చిన మానవి ఏమైంది, ఎలా బ్రతుకుతోంది అని ఆలో చించలేదు. ఇప్పుడు శరీరం శక్తిహీనమై, డబ్బు చేయిజారి, తాను దరిజేరిన వాళ్ళు తనకు దూరమైతే ఎప్పుడో సమాధి పొందిన మానవి, గుర్తుకు వచ్చింది. అన్ని ఆశలూ వదలి నిర్లి ప్తంగా మృత్యువుకు మాత్రమే ఎదురుచూస్తూ బ్రతుకుతున్న తాను ఇప్పుడు మళ్ళా భర్తనీ, సంసారమనీ, ఎందుకు నాటకం

ప్రారంభించడం ? అందుకు ఇప్పుడు ఒంట్లో శక్తి, మనస్సులో ఉత్సాహం రెండూ లేవనిపించింది. అతను వెళ్ళిపోయిన రోజు అనుభవించిన బాధ ముల్లులా ఇవ్వాళ మళ్ళా గుచ్చుకుంది.

ముఖంకూడా కనపడకుండా దుప్పటి కప్పుకు పడుకుంది. మనస్సులోని బాధ విరక్తితో శరీరం జడత్వం పొందింది. శివయ్య గదిలోకి వచ్చాడు, నెమ్మదిగా కర్ర జరుపుకుంటూ. ఆ చప్పుడు విని కూడా మానవి కదలలేదు. శివయ్య దీనంగా "అమ్మలూ" అని పిలిచాడు. ఆ పిలుపుకు మానవి అదిరిపడింది. అది ఎప్పుడో క్రిందటి జన్మలో తన పేరులా అనిపించింది. ఎప్పుడో పసిపిల్లగా ఉన్నప్పుడు తన తల్లి ఆ పేరుతో పిలిచింది. పెళ్ళయ్యాక శివయ్య అదే అలవాటు చేసుకున్నాడు. మానవికి తాను ఒక్కసారి మళ్ళా చిన్న పిల్లయి నట్లనిపించింది. కళ్ళల్లో నీళ్ళు నిండినాయి. శివయ్య దగ్గరగా వచ్చి కూర్చున్నాడు. "అమ్మలూ ఈ ఉంగరం తీసుకో. ఇది ఒక్కటీ దాచి తెచ్చాను; ఇంకేమీ మిగలలేదు. అన్నీ చెదరిపోయినాయి" అన్నాడు దీనంగా. ఆ గొంతులో అణగారిన మనిషి వ్యథ ప్రతిధ్వనించింది. మానవి మనస్సులో కోపమూ, బాధ ఒక్కసారి శిథిలమైనాయి. ఆ పరిచితమైన కంఠానికీ, తనకూ మధ్య ఎడం లేనట్లనిపించింది. ఆమె లేచి కూర్చుంది. చేయిచాపి ఆ ఉంగరం అందుకుంది. దానికేసి చూడలేదు. అతని కళ్ళలో కదులుతున్న దీనత్వం చూసింది. అతను మళ్ళా అన్నాడు: "ఇది చాలా విలువైంది. ఆ రాళ్ళన్నీ మంచి వజ్రాలు" అని. ఆమె చిరునవ్వు నవ్వింది. ఇంత ఖరీదైన వస్తువుచూస్తే ఏమీ

తేలేదని దిగాలుపడి హాలులో కూర్చున్న కూతురు ముఖం ఎంత వికసిస్తుంది! అది తలుచుకొని ఆమె నవ్వుకొంది. "రండి హాలులోకి వెడదాం!" అన్నది శివయ్యతో.

హాలులోకి వెళ్ళగానే మానవి ఉంగరం చాపమీద పడేసింది. "ఆయన తెచ్చారు" అన్నది క్లుప్తంగా. మధుర దాన్ని ఆత్రంగా లాక్కుంది. కామయ్య దగ్గరగా వచ్చి చూశాడు - ఏం ఉంగరమో, ఏంతఖరీదు ఉంటుందో అని. "మూడువేలైనా ఉండొచ్చు" అన్నాడు కామయ్య అంచనా వేస్తున్నట్టు. మధుర ముఖం విప్పారింది. "అవునా!" అన్నది ఆశతో. మానవి నవ్వుకొంది. మెల్లగా శివయ్య చేయి పట్టుకుంది. మళ్లా ఇన్నాళ్ళకు తనచేతిలో మరొకచేయి ఉండడం ఆమెకేదో లేనిబలం వచ్చినట్టనిపించింది.